# సమంజస జీవనవేతనం అన్నది కలగానే మిగిలిపోయిన శ్రీలంక తేయాకుతోటల

**శ్రీలంక** దేశంలో ప్రపంచ వ్యాపితంగా పేరు గాంచిన 'సిలోన్‌టీ' యొక్క 150 సంవత్సరాల సంబరాలు జరుగుతున్నాయి. ఇక్కడి తేయాకు పరిశ్రమ తేయాకు ఎగుమతులద్వారా ఎనలేని లాభాలను పొందుతోంది. కానీ ఆ పరిశ్రమలో-తేయాకు తోటల్లో పనిచేసే కార్మికుల జీవన స్థితిగతులు మాత్రం అధ్వాన్నంగానే వున్నాయి.

శతాబ్దంన్నర క్రితం దక్షిణ భారతదేశం నుండి బ్రిటిష్ పాలకులు తమ తేయాకు తోటల్లోకి కట్టు బానిసలుగా కూలీలను తీసుకువెళ్ళిన నాటి తేయాకు తోటల కార్మికుల జీవన పనిపరిస్థితులే నేటికీ, శ్రీలంక తేయాకు తోటల్లో కొనసాగుతున్నాయి. వారి వేతనాలు గానీ, వారి గృహసౌకర్యంగానీ, వైద్యం-విద్య సదుపాయాల అందుబాటుకానీ, తేయాకు తోటల యజమానులుచేత నిర్లక్ష్యం చేయబడి, వారి బ్రతుకులు ఘోరంగా వున్నాయి.

ఇటీవలనే యిద్దరు తేయాకుతోట కార్మికులు, కోర్టులో ఒక వివాదం లేవనెత్తారు. తాము నివసించటానికి యజమాని కల్పించిన యిళ్ళు కాలిపోయినా, యజమాని తమకు వేరే నివాస వసతి కల్పించలేదన్నది ఆ వివాదం. ఈ వివాదాన్నిబట్టి వారు ఎంతటి అధ్వాన్నమైన జీవన, పనిపరిస్థితుల్లో జీవించాల్సిన స్థితికి నెట్టబడ్డారో అర్ధమవుతుంది.

ఈ పరిస్థితుల మెరుగుకోసం 2016 సెప్టెంబరులో, తేయాకు కార్మికులు భారీఎత్తున ఆందోళనలు, సమ్మెలు నిర్వహించారు. తమకు రోజుకు 416 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండుచేస్తూ, పోరాటాలు చేశారు. ఫలితంగా పరిశ్రమాధిపతులతో, వివిధ యూనియన్లు ఒక సమిష్టి ఒప్పందాన్ని చేసుకొన్నాయి. ఆ ప్రకారం రోజుకు కనీస వేతనం రు.307గా నిర్ణయింపబడింది.

ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల వలన ఆ కనీస వేతనం, ఏమాత్రం ఆ కార్మికుల కనీస అవసరాలను తీర్చటానికి సరిపోదు. పైపెచ్చు ఆ రు.307/- కనీస వేతనం కూడా కార్మికులందరికీ లభించదు. కారణమేమిటంటే, రోజుకు 20 కిలోల తేయాకును కోసిన కూలీలకు మాత్రమే ఆ వేతనం పరిమితం చేశారు. ఆ రకంగా పని భారానికి, కనీస వేతనానికి లంకెపెట్టి పరిశ్రమాధిపతులు తేయాకు కార్మికులను నిర్దాక్షిణ్యంగా దోచుకొంటున్నారు.

తేయాకు కార్మిక సంఘాల నాయకులు సహితం, ప్రభుత్వ-యజమానుల కనుసన్నల్లోనే వ్యవహరిస్తున్నారని అనుభవంలో రుజువయిన వాస్తవం.

ఐక్యరాజ్యసమితి పేర్కొన్న నిలకడైన అభివృద్ధి లక్ష్యాలలో కార్మికులకు "సమంజస వేతనం" యివ్వాలన్నది ఒక లక్ష్యం.

ప్రస్తుత యీ జీవన వేతనం అన్నదే దొరకని స్థితిలో వున్న శ్రీలంక తేయాకు తోటల కార్మికులకు యిక సమంజసమైన వేతనం అన్నది కలగానే మిగిలిపోయింది.

మరి యీ తేయాకు తోటల కార్మికులకు, గౌరవప్రదమైన జీవనాన్ని గడిపే జీవన, పని పరిస్థితులు ఎన్నటికి ఏర్పడతాయన్నది ప్రశ్నార్ధకంగానే మారిపోయింది.

వాస్తవానికి మన దేశంలోని తేయాకు తోటల కార్మికుల జీవన, పనిపరిస్థితులు కూడా యింతకన్నా ఏమీ మెరుగ్గాలేవు. అదే విధంగా బంగ్లాదేశ్‌లోని తేయాకుతోటల కార్మికుల స్థితిగతులున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానం వ్యాపార పోటీలో మనుగడ పేరిట, యీ రకంగా కార్మికులను - వారి శ్రమశక్తిని ఘోరంగా దోపిడీ చేసుకొనే అవకాశాలను, పద్ధతులను మరింత తీవ్రతరం చేసింది.

ఈ సామ్రాజ్యవాద దోపిడీని ప్రతిఘటించి, పోరాడటంద్వారా మాత్రమే తేయాకు తోటల కార్మికులు తమ స్థితిగతులను పెంచుకోగలరనే వాస్తవాన్ని శ్రీలంక కార్మికుల అనుభవం తెలుపుతోంది.

ooooo